క్లుప్తంగా

చారిత్రక గడి కూల్చివేతపై విచారణ వాయిదా



కమలాపూర్ : మండల కేంద్రంలోని పురాతన, చారిత్రక గడి కూల్చివేతపై విచారణ వాయిదా పడింది. కమలాపూర్ గడిని కొందరు కొనుగోలు చేశామనే నెపంతో కూలగొడుతున్నారని, తమ తాతల కాలం నుంచి ఈ గడి గ్రామ దేవతలకు నిలయంగా ఉంటోందని, ఇక్కడి నుంచే సమ్మక్క–సారలమ్మ జాతరకు, దసరా వేడుకలకు అంకురార్పణ జరుగుతుందని, చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్న గడిని కూల గొట్టకుండా భావితరాల కోసం ఉంచాలని కోరుతూ కుల సంఘాల ఆధ్వర్యంలో గత నెల 24వ తేదీన జిల్లా పంచాయతీ అధికారికి పలువురు ఫిర్యాదు చేశారు. డీపీఓ ఆదేశాల మేరకు మండల పంచాయతీ అధికారి చేతన్ రెడ్డి, ఎంపీడీఓ గుండె బాబు బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో గడి కొనుగోలు దారులు, ఫిర్యాదు దారులతో సమావేశమై విచారణ జరిపారు. ఈ సందర్భంగా అధికారులు అందుబాటులో ఉన్న ఇరు వర్గాల నుంచి వాంగ్మూలాలు సేకరించారు. విచారణకు సంబంధించి ఫిర్యాదు దారులకు పూర్తిస్థాయిలో సమాచారం లేనందున విచారణకు హాజరు కాలేదని, ఫిర్యాదు దారులందరికీ సమాచారం ఇచ్చి విచారణ జరపాలని గ్రామస్తులు కోరారు. దీంతో విచారణ వాయిదా వేస్తున్నామని, తదుపరి విచారణ తేదీని ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

కోర్టుకు హాజరుకాని నిందితుల రిమాండ్

ఆత్మకూరు : కోర్టుకు సరిగా హాజరుకాని నిందితులకు పరకాల మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ సంతోష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన బరుపట్ల శ్రవణ్, మస్కా నితిన్ 2023 సంవత్సరంలో గొడవపడిన కేసులో అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నిందితులిద్దరూ కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ ఇవ్వగా అరెస్టు చేసి బుధవారం కోర్టులో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. దీంతో మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ సంతోష్ పేర్కొన్నారు.

స్కూటీని దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

ధర్మసాగర్ : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో ఈనెల 3న స్కూటీని దొంగిలించిన వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా ఎడ్లపాడు గ్రామానికి చెందిన నాదెండ్ల వెంకటసుబ్బయ్య ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. అతడు జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈక్రమంలో ఈనెల 3న రాంపూర్ గ్రామానికి చెందిన మునిగాల రాజయ్య తన స్కూటీపై గ్రామంలోని కిరాణానికి వెళ్లి షాపు ఎదుట నిలిపి తిరిగి బయటికి వచ్చి చూసేసరికి తన స్కూటీ కనిపించలేదు. దీంతో ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. స్కూటీని దొంగిలించిన నిందితుడు రెండు నెలల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేటలో రాత్రి వేళలో ఓ ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో నుంచి బంగారు నగలు దొంగలించినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. రాంపూర్‌లో స్కూటీని దొంగిలించి వెళ్తూ మార్గమధ్యలో ఆలేరు హైవేపై ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు చైన్ లాక్కొని వెళ్లి హైదరాబాద్‌లో తాకట్టు పెట్టాడని, వాటికి సంబంధించిన పత్రాలు చూపిస్తూ అతడు చేసిన దొంగతనాలు ఒప్పుకున్నాడని వివరించారు. సదరు వ్యక్తి నుంచి స్కూటీ, ఓ ఫోన్, బంగారం తాకట్టు పెట్టిన కాగితాలను పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర హాస్యాస్పదం

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న పాదయాత్ర హాస్యాస్పదమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అధ్యక్షతన ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వ సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత దేశంలో రెండు సీట్లతో మొదలైన బీజేపీ ప్రస్థానం నరేంద్రమోదీ నాయకత్వంలో మూడు పర్యాయాలు దేశాన్ని పాలిస్తుందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా దేశంలో నరేంద్రమోదీ ఎన్నో సంస్కరణలు చేస్తున్నారని గుర్తుచేశారు. భారతదేశంలో ఉగ్రవాదం తగ్గిందని, ఎన్నో ఏళ్లుగా తల నొప్పిగా మారిన కాశ్మీర్ అంశం 370 రద్దు చేయడం వలన కాశ్మీర్ ప్రజలు ప్రశాంతంగా నివసిస్తున్నారని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని, బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ ఏనాడు గౌరవించలేదని, బీజేపీ అధికారంలోకి రాగానే అంబేడ్కర్‌కు భారత రత్న ఇచ్చిందని గుర్తుచేశారు.

ఆధ్యాత్మికం @ నవనాగక్షేత్రం

- దోషాల నివారణకు ఆశ్లేష బలిపూజ
- కాల సర్ప దోషాల నుంచి ఉపశమనం



ఆశ్లేష బలిపూజ చేస్తున్న భక్తులు

ధర్మసాగర్ : మానవులకు సర్ప దోషం, నాగ దోషం, కుజ దోషం, మాంగళ్య దోషం, కాల సర్ప దోషాల నుంచి ఉపశమనం, రక్షణ కల్పించేందుకు ఆశ్లేష బలి పూజ ఎంతో దోహదపడుతుందని పురాతన వేద జ్యోతిష్యశాస్త్రం ఆధారంగా పలువురు పండితులు అంటున్నారు. ఆశ్లేష బలి పూజ అంటే ఏమిటి, దీన్ని ఎవరు చేయాలి, ఏ తేదీన చేయడం శుభప్రదం, నిర్వహించాల్సిన విధానం ఏమిటి, వాటి గురించి తెలుసుకుందాం.

ఆశ్లేషబలి పూజ పురాతన కాలం నుంచి ఉంది. సర్ప ఆరాధన లేదా నాగ ఆరాధన గురించి వివిధ పురాణాల్లో ప్రస్తావిం చబడింది. ఈ పూజ అనారోగ్యం నుంచి ఉపశమనం కలిగిస్తుందని, వైవాహిక జీవితంలో సమస్యల పరిష్కారం, వివాహం, సంతానం కలుగకపోవడం తదితర సమస్యలు తొలగిపోతాయని పలువురి నమ్మకం. చర్మ సంబంధిత వ్యాధులు, పనుల్లో జాప్యం, రోజువారీ జీవితంలో అడ్డంకులు తొలగిపోతాయని పండితులు అంటున్నారు. ఈ అశ్లేష బలిపూజ నక్షత్ర రోజున ప్రతి 27 రోజులకు ఒకసారి చేయడం చాలా శుభప్రదం అని, కాలసర్ప దోషం, కుజ దోషం నుంచి రక్షణ పొందేందుకు సుబ్రహ్మణ్యస్వామిని ఆరాధించడం మంచిదంటున్నారు. అశ్లేష బలిపూజ చేయడం వలన రాహు, కేతువుల దుష్ప్రభావాలను తటస్థీకరించడానికి ఒక శక్తివంతమైన నివారణ అని జ్యోతిష్యశాస్త్రం చెబుతుందని అంటున్నారు. ఆశ్లేష నక్షత్రంలో జన్మించిన వారు ఆశ్లేష బలిపూజ, శాంతి పూజల నుంచి ప్రయోజనం పొందుతారని, ఇది సర్ప దేవతల ఆశీస్సులను నిర్ధారిస్తుందని అంటున్నారు. పూజ చేయడం ద్వారా జీవితంలోని హెచ్చు తగ్గులు సహా అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని వివరిస్తున్నారు. అశ్లేష నక్షత్రంలో జన్మించడం అంటే.. హిందూ జ్యోతిష్య నక్షత్ర సమూహంలోని 27 నక్షత్రాల్లో అశ్లేష ఒకటి. అశ్లేష అంటే విడదీయరానిది. వాల్మీకి రామాయణం ప్రకారం, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు ఈ నక్షత్రంలో జన్మించారు. అశ్లేష నక్షత్రంలో జన్మించిన వ్యక్తులు చాలా ప్రకాశవంతంగా ఉంటారని, ఆర్ట్స్, కమ్యూనికేషన్లలో ఆసక్తి చూపుతారని పండితుల అభిప్రాయం. వారు నాయకత్వ లక్షణాలను కూడా కలిగి ఉంటారని అంటున్నారు. అశ్లేష నక్షత్రంలో జన్మించిన వారు ఈ పూజను చేయవచ్చని అంటున్నారు. కాగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఏకైక దేవాలయం ధర్మసాగర్ మండలంలోని క్యాతంపల్లి గ్రామ శివారులోని శ్రీ ఓషధీశ్వర మానసాదేవి సహిత నవనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతీ నెల అశ్లేష నక్షత్రంలో ఈ పూజలు నిర్వహిస్తారు.

రాష్ట్రాన్ని మొదటిస్థానంలో నిలిపిన కేసీఆర్



ఎల్కతుర్తి : సభ స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్



ఐనవోలు : మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- బోయినపల్లి, ఎర్రబెల్లి

ఎల్కతుర్తి : తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఈనెల 27న నిర్వహించనున్న రజతోత్సవం సందర్భంగా సభ స్థలాన్ని బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ సభ ఏర్పాటు కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములు ఇవ్వడం సంతోషకరమన్నారు. సభకు ప్రజలు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సదానందం, యాదవరెడ్డి, వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని వెంకటసాయి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ హాజరై కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

ఐనవోలు : ఈనెల 27వ తేదీన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సభకు పెద్దెత్తున కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహిచంగా.. ఆ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో అందుబాటులోకి వచ్చి నేరుగా కార్యకర్తలతో మాట్లాడారు. సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలపై కోపంతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. మండలం నుంచి సుమారు 3వేల మంది సభకు రావాలని, అందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అదే విధంగా మండల కన్వీనర్‌గా కొండపర్తి గ్రామానికి చెందిన తంపుల మోహన్, మండల వర్కింగ్ ప్రసిడెంట్‌గా నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావును నియమించారు. వివిధ గ్రామాల బీఆర్ఎస్ గ్రామ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్‌రావు, ఉస్మాన్‌అలీ, సదానందం, సురేశ్ పాల్గొన్నారు.

అందరికి ఆదర్శం అంబేడ్కర్ : మంద కృష్ణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి గజమాల వేస్తున్న మంద కృష్ణమాదిగ

శాయంపేట : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ అన్నారు. మండలంలోని కొప్పులలో బుధవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి గజమాల వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. అంబేడ్కర్ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, రాజ్యాంగ నిర్మాతగా బడుగు బలహీన వర్గాలకు జీవం పోశాడని కొనియాడారు. అసమానతలను తొలగించేందుకు మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఎంతో కష్టపడ్డారని గుర్తుచేశారు. 30 ఏళ్లుగా ఎమ్మార్పీస్ ద్వారా ఎస్సీ ఏబీసీడీ చేపట్టాలని పోరాటం చేస్తే దేశంలో ఉండే అత్యున్నతమైన దేశ రాష్ట్రపతి ద్రౌపతిముర్మును, ప్రధానమంత్రి నరేంద్రమోదీని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఒప్పించి ఎస్సీ వర్గీకరణ సాధించామని అన్నారు. అనంతరం మంద కృష్ణమాదిగను కొప్పుల గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు గజమాలతో సత్కరించారు. ఎమ్మెస్పీ జాతీయ నేత కుమార్, ఎమ్మార్పీఎస్ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు దయాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సుకుమార్, మాజీ జెడ్పీటీసీ మొగిలి, మాజీ సర్పంచ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం



విరాళం అందజేస్తున్న రవీందర్‌గౌడ్

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ రూ.10 వేల విరాళాన్ని అంబేడ్కర్ కమిటీ సభ్యులకు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఏరుకొండ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహం మండల కేంద్రంలో ప్రతిష్ఠించడం చాలా మంది నిర్ణయమని, వారికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బరుపట్ల కిరీటి, నత్తి చందర్, మంద రవి, సంగే మహేందర్, నత్తి కరుణాకర్, జన్నారపు కరుణాకర్, నాగలి రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కేంద్రాలను వినియోగించుకోవాలి

- డీఎంహెచ్‌ఓ అప్పయ్య



పెద్దకోడెపాకలో పేషెంట్లతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

శాయంపేట : ఆయుష్మాన్ కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పెద్దకోడెపాక, గట్లకానిపర్తి గ్రామాల్లో గల ఆరోగ్య ఆయుష్మాన్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెద్దకోడెపాకలోని సబ్ సెంటర్‌లోకి వచ్చిన రోగులతో మాట్లాడారు. వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకోగా బీపీ, షుగర్ మందులకు వచ్చినట్లు వారు తెలిపారు. దీంతో స్పందించిన అప్పయ్య ప్రతి నెల ప్రభుత్వం ఇచ్చే మందుల వలన సంవత్సరానికి ఒక్కో పేషెంట్ రూ. 3500 అందుతున్నాయని, గ్రామాల్లో ఎవరు కూడా ప్రైవేట్ మందులు వాడొద్దని సూచించారు. సెంటర్‌లో 150 మంది షుగర్, 204 మంది బీపీ పేషెంట్లు ఉన్నారని డాక్టర్ అభినందనరెడ్డి డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి టీచర్లతో మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పిల్లలకు పోషకాహారం, టీకాలు ఇవ్వాలన్నారు. అనంతరం గట్లకానిపర్తి సబ్‌సెంటర్‌ను సందర్శించి సబ్ సెంటర్ డాక్టర్ అపర్ణను వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సబ్ సెంటర్ భవనాన్ని పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి సాయికృష్ణ, సూపర్‌వైజర్ భద్రయ్య, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు ఉన్నారు.

దామెర : వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, ఫార్మసీ గదిలో మందుల స్టాక్ పరిశీలించారు.

వంద మంది కూలీలకు పని కల్పించాలి

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు



దామెరలో ఉపాధి హామీ పనుల వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు

దామెర : ప్రతి గ్రామంలో వంద మందికి తగ్గకుండా ఉపాధి హామీలో పని కల్పించాలని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారిగా నిర్దేశించిన టార్గెట్, చేరుకున్న లక్ష్యం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో వంద మంది కూలీలకు తగ్గకుండా పని కల్పించాలని అన్నారు. కొలతల ప్రకారం కనీసం ఐదు గంటలు పనిచేయించి రూ. 307 కూలి వచ్చే విధంగా చూడాలన్నారు. కూలీల హాజరు ఎన్ఎంఎంఎస్‌లో మొబైల్ ద్వారా పంపించాలని సూచించారు. నర్సరీల్లో ప్రతి మొక్క బతికే విధంగా ఉదయం, సాయంత్రం నీళ్లు పట్టాలని వనసేవకులను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కల్పన, ఏపీఓ శారద, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వనసేవకులు పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : ఉపాధి హామీ కూలీలకు ప్రతిరోజు రూ.307 వచ్చేలా పని కల్పించాలని ఎంపీడీఓ ఆంజనేయులు ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ఈజీఎస్ ఫీల్డ్ ఆఫీసర్స్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పని ప్రదేశంలో మస్టర్ ప్రకారం ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా అటెండెన్స్ నమోదు చేస్తున్నారా లేదా అని వారంలో ఒక రోజు తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్‌లు పనికి సంబంధించిన కొలతలు తీసుకొని కంప్యూటర్ సెంటర్‌లో అప్పగించాలన్నారు.

ముర్రుపాలతో రోగనిరోధక శక్తి



శాయంపేట : మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత

శాయంపేట : పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రుపాలను తాగించడం వలన పిల్లలల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ సునీత, పుణ్యవతి అన్నారు. బుధవారం మండలంలోని సెక్టార్1లో ప్రగతి సింగారం, సెక్టార్ 2 శాయంపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్త్రీ గర్భందాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే 280 రోజులు, బిడ్డ పుట్టిన నుంచి మొదలుకొని 2 సంవత్సరాల పిల్లల వరకు 720 రోజులని మొత్తంగా 1000 రోజులు అతి ముఖ్యమైన రోజులని తెలిపారు. గర్భిణులు, తల్లులు రక్తహీనత రాకుండా ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వాలన్నారు. వేసవి ఎండలో బయట తిరుగవద్దని, ఏమైన పనులు ఉంటే సాయంత్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుష్మ, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శ్రీలత, ఆయాలు, కిశోర బాలికలు, ఆశలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ ఆత్మకూరు సెక్టర్ సూపర్‌వైజర్ ఉమాదేవి అన్నారు. పోషణ్ పక్వాడ్‌లో భాగంగా బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు, మహిళలకు, చిరుధాన్యాల ఉపయోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు మెరుగైన పౌష్టికాహారం అందుతుందన్నారు. ప్రతిఒక్కరూ చిరుధాన్యాలను తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దేవమ్మ, కరుణ, పుష్పనీలా, సులోచన, పద్మ, వాణి, శ్రీవిద్య, ఆశ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2 టీచర్ సంపూర్ణ ఆధ్వర్యంలో బుధవారం పిల్లల తల్లిదండ్రులకు, బాలింతలకు పోషణలోపంపై అవగాహన కల్పించారు. సంపూర్ణ మాట్లాడుతూ.. కొలమానం ద్వారా పిల్లల ఎదుగుతల గురించి తెలుసుకుని పోషణ లోపాన్ని ముందే గుర్తించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు పాల్గొన్నారు.

కాపర్ వైర్ చోరీ



ధ్వంసమైన మోటార్

ఆత్మకూరు : కరెంటు మోటార్లలోని కాపరు వైరును చోరీ అయిన సంఘటన మండలంలోని అక్కంపేటలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కంపేటకు చెందిన రేగుల రవితో పాటు రైతులు చింతాకుల ఇంద్రయ్య, రేగుల ప్రభాకర్, కొండి ప్రకాశం, గడ్డి ఐలయ్య, పెండ్లి సంపత్, దేవులపల్లి రమేశ్ మోటార్లు బిగించుకొని వ్యవసాయ భూమికి నీరు పారించుకుంటున్నారు. ఈ క్రమంలో రైతుల మోటార్లలో ఉన్న కాపర్ వైర్‌ను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజ్యాంగంపై విషం చిమ్ముతున్న బీజేపీ



ఎల్కతుర్తి : పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



శాయంపేట : నేరుడుపల్లిలో..



ఆత్మకూరు : ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి : రాజ్యాంగంపై విషం చిమ్ముతున్న బీజేపీ కుట్రను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, అయిలయ్య అన్నారు. బుధవారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్ర ఎల్కతుర్తి మండలం కోతులనడుమ, వల్భాపూర్, వీరనారాయణపూర్, పెంచికలపేట గ్రామాల్లో గురువారం కొనసాగింది. అలాగే భీమదేవరపల్లి మండలంలోని రామ్‌నగర్, బొల్లోనిపల్లి, మంగళపల్లి, గట్లనర్సింగాపూర్ గ్రామాల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ మహాత్మాగాంధీ వారసత్వాన్ని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరచడం యావత్ భారతదేశాన్ని అవమానపరిచినట్లేనని అన్నారు. బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానించే బీజేపీ, అనుబంధ సంస్థ దాడులను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ అంబేడ్కర్‌ను గౌరవించాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, సుకినె సంతాజీ, నాయకులు మంద సుమన్‌గౌడ్, శ్రీకాంత్, రత్నాకర్, సురేశ్, చంద్రశేఖర్‌గుప్తా, పూర్ణచందర్, రాకేశ్, అనిల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేద్దామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ అన్నారు. మండలంలోని కొత్తగట్టులో బుధవారం జై బాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర పన్నుతోందన్నారు. ఏఎంసీ చైర్ పర్సన్ సునంద, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, మాజీ సర్పంచ్‌లు రవికుమార్, శ్రీనివాస్, రవి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శాయంపేట : రాజ్యాంగంతో బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని నేరేడుపల్లి, అప్పయ్యపల్లి, ప్రగతి సింగారం గ్రామాల్లో బుధవారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు చక్రపాణి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, రవి, కృష్ణమూర్తి, రమేశ్, కట్టయ్య, హైదర్ పాల్గొన్నారు.

పరకాల : దేశంలో శాంతి, సౌభాగ్యం, సమానత్వ విలువలు పెంపొందించి తద్వారా రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సంవిధాన్ పాదయాత్ర పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్దె పెద్దన్న అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో జైబాపు జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో పాదయాత్ర చేపట్టారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ జీఆర్ఎస్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు సంబంధించిన సన్నాహక సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు బొల్లెబోయిన రవియాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

మందకృష్ణను కలిసిన నాయకులు



మందకృష్ణను సన్మానిస్తున్న ఊరుగొండ ఎమ్మార్పీఎస్ నాయకులు

దామెర : మండలంలోని ఊరుగొండ ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణను కలిశారు. వరంగల్ పర్యటనలో భాగంగా దుర్గంపేట్ సమీపంలోని ఎన్ఎస్ఆర్ హోటల్‌లో కాసేపు బసచేశారు. ఈ సందర్భంగా ఊరుగొండకు చెందిన సాంబయ్య, కమలాకర్, విజయ్, వినయ్, ప్రణయ్‌తో పాటు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

ఆరె సంఘం బలోపేతానికి కృషి



దామెర: ఆరె కుల సంఘం బలోపేతానికి కృషి చేస్తానని దామెర ఆరె కుల సంఘం అధ్యక్షుడు హింగె రాజేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఆరె వాడలో ఆరెకుల సంఘ సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా హింగె బాబురావు, హింగె నాగేశ్వర్‌రావు అధ్యక్షుడిగా హింగె రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా హింగె నగేశ్, ప్రధాన కార్యదర్శిగా హింగె రవీందర్, ఉప కార్యదర్శిగా దుర్గనాల యోగేశ్వర్, కోశాధికారిగా సండెసారి సంతోశ్ బాబు, కార్యవర్గ సభ్యులుగా మటికె కిషన్, సిరూరి సుగుణాకర్‌రావు, హింగె సత్యనారాయణ, సుకినె పెద్దన్న, మోటె శంకర్‌రావు, హింగె రవీందర్‌ను ఎన్నుకున్నారు. ఆరెకుల సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.